
సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



పల్లెల్లో మత్తు..

గంజాయి ఇతర మత్తుపదార్థాల దందా పల్లెలనూ చేరింది. యువతను టార్గెట్‌గా చేసుకుని మత్తుపదార్థాలు విక్రయిస్తున్నారు.

- 9లో ▸



నిర్మాణం పూర్తయ్యేనా?

నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద శివారులో ఆలేరు వాగుపై చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.9 /12.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగవచ్చు. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మేడారం జాతరకు 270 బస్సులు

ఖలీల్‌వాడి : మేడారంలో ఈ నెల 19 నుంచి 29 వరకు జరిగే సమ్మక్క సారక్క జాతరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి 270 బస్సులు పంపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం జానీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ట్రిప్పులు తగ్గించామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. జాతర తర్వాత యథావిధిగా బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం ప్రసాదం



కామారెడ్డి టౌన్: మేడారం సమ్మక్క సారలమ్మ బంగారం ప్రసాదాన్ని ఆర్టీసీ కార్గో సేవల ద్వారా పొందవచ్చని ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. శనివారం ఆమె ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ప్రసాదాన్ని బుక్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారం వెళ్లలేని భక్తులు రూ. 299 చెల్లిస్తే ఇంటికే అమ్మవారి ప్రసాదాన్ని పంపిస్తామన్నారు. పేటీఎం ఇన్‌సైడర్ యాప్ ద్వారా కూడా ప్రసాదం బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్‌లు లింగమూర్తి, వసుంధర, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు తదితరులున్నారు.

డీటీవో బదిలీ



శ్రీనివాసరెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా రవాణా శాఖ అధికారి వాణి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఎంవీఐ శ్రీనివాసరెడ్డికి ఇన్‌చార్జి (ఫుల్ అడిషనల్ చార్జీ) బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో కేవీఆర్



కామారెడ్డి టౌన్: ఢిల్లీలో జరుగుతున్న బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. శనివారం ప్రారంభమైన సమావేశాలు ఆదివారం ముగియనున్నాయి. కేవీఆర్‌తోపాటు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కూడా సమావేశాలలో పాల్గొన్నారు.

'విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి'



కామారెడ్డి అర్బన్: ఎస్సెస్సీ విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.రాజు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చదివించాలని సూచించారు. పరీక్షలంటే భయాన్ని పోగొట్టాలన్నారు. సమావేశంలో హెడ్‌మాస్టర్ గంగాకిషన్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, నవీన్‌కుమార్, శ్రీనివాస్, సాయిలు, సహేందర్, మాధూరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆవిష్కరణలు



డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'వన్ డిస్ట్రిక్‌-వన్ ఎగ్జిబిషన్' కార్యక్రమం విజయవంతమైంది. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. వివిధ ప్రాంతాల నుంచి ఔత్సాహికులు వచ్చి ప్రదర్శించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. రైతులు, విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆవిష్కరణలను తిలకించారు.



మరాఠ్వాడా సామ్రాజ్యాధినేత.. హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత చరిత్ర స్ఫూర్తిగా.. ఆయనను ఆరాధించేవారు జిల్లాలో క్రమక్రమంగా పెరుగుతున్నారు. పల్లెల నుంచి మొదలుకొని నగరాల వరకు ప్రతి ఏటా ఆయన జయంతిని పండుగలా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఊరూరా శివాజీ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో శివాజీనగర్, దుబ్బ, రైల్వేస్టేషన్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల కూడళ్లను శివాజీ చౌక్‌లుగా పిలుచుకుంటున్నారు. సోమవారం శివాజీ మహరాజ్ 394వ జయంతిని ఘనంగా జరుపుకునేందుకు శ్రీ శివాజీ మహరాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో నగరంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

సండే స్పెషల్

మహారాష్ట్ర సరిహద్దుతో ప్రభావం

మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను దైవసమానంగా భావిస్తారు. ఇందూరు జిల్లా మహారాష్ట్ర సరిహద్దుకు అనుకుని ఉండడంతో పాటు ఈ జిల్లాపై శివాజీతో పాటు ఆయన గురువైన సమర్థ రామదాసు ముద్ర ఎక్కువగా ఉంది. శ్రీరాముడు, హనుమంతుడి భక్తుడైన సమర్థ రామదాసు 17వ శతాబ్దంలో నిర్మింపజేసిన ఆలయాలు ఇందూరులో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇందూరులోని పెద్దరామమందిర్, సారంగపూర్ హనుమాన్ ఆలయం, రఘునాథ ఆలయాలు సమర్థ రామదాసు ఆధ్వర్యంలో నిర్మితమయ్యాయి. రఘునాథ ఆలయంలో ధ్యాన మందిరం నిర్మించారు. ఇందులో సమర్థ రామదాసుతో పాటు ఛత్రపతి శివాజీ సైతం ధ్యానం చేసుకున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. సారంగపూర్ హనుమాన్ మందిరం ప్రాంగణంలో సమర్థ రామదాసు విగ్రహం ఉంది. రఘునాథ ఆలయం, పెద్దరామ మందిరాలతో పాటు సారంగపూర్ ఆలయాన్ని ఛత్రపతి శివాజీ సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది.



ఎడపల్లి మండలం రాణాకలాన్‌లో ఛత్రపతి విగ్రహం

జై.. ఛత్రపతి

- భారీగా శివాజీ మహరాజ్ విగ్రహాల ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా సుమారు 200 పైగా గ్రామాల్లో..
- మరాఠ్వాడా వీరున్ని స్ఫూర్తిగా తీసుకుంటున్న యువత
- జిల్లాపై మహారాష్ట్ర సరిహద్దు ప్రభావం
- రేపు 394వ జయంతి



గతేడాది శివాజీ జయంతి సందర్భంగా నగరంలో శ్రీ శివాజీ మహరాజ్ సేవాసమితి ప్రదర్శన


సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హిందూ హృదయ సామ్రాట్‌గా కీర్తి గడించిన మరాఠ్వాడా సామ్రాజ్యాధినేత ఛత్రపతి శివాజీ మహరాజ్ ట్రెండ్ ఇందూరు జిల్లాలో విస్తృతంగా విస్తరిస్తోంది. వరుసగా ఒక్కో గ్రామంలో శివాజీ మహరాజ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 200 పైగా విగ్రహాలను వివిధ గ్రామాల్లో నెలకొల్పారు. గతంలో యువత మాత్రమే శివాజీ విగ్రహాల ఏర్పాటుకు మొగ్గు చూపేవారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో యువతతో పాటు పెద్దలు, మహిళలు సైతం ఛత్రపతి విగ్రహాల ఏర్పాటులో భాగం పంచుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులే శివాజీ విగ్రహాల ఏర్పాటులో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. శివాజీ అణగారిన, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడడంతో పాటు తల్లిని ఏవిధంగా గౌరవించాలో ఆచరించి చూపారని, ఇలాంటి స్ఫూర్తి కోసమే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఎవరి సమస్యలు వారే పరిష్కరించుకోవాలనే స్ఫూర్తిని సైతం శివాజీ నుంచి పొందవచ్చని యువకులు చెబుతున్నారు. ఇక ఇందూరు నగరంలో శివాజీనగర్, దుబ్బ, రైల్వే స్టేషన్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల కూడళ్లను శివాజీ చౌక్‌లుగా పిలుచుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో మరిన్ని గ్రామాల్లో శివాజీ విగ్రహాలు నెలకొల్పేందుకు ఆయా గ్రామాల ప్రజలు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రేపు ఇందూరు నగరంలో భారీ ప్రదర్శన

శివాజీ మహరాజ్ 394వ జయంతిని పురస్కరించుకుని సోమవారం శ్రీ శివాజీ మహరాజ్ సేవాసమితి ఇందూరు జిల్లా ఆధ్వర్యంలో ఇందూరు నగరంలో హైదరాబాద్ రోడ్‌లో ఉన్న బోర్గం వద్ద నుంచి వినాయక్‌నగర్, పులాంగ్, శివాజీనగర్ శివాజీ చౌక్, పెద్ద బజార్, నెహ్రూ పార్క్, రైల్వే స్టేషన్ శివాజీ చౌక్ వరకు భారీ ర్యాలీ చేయనున్నారు. 2017 నుంచి పనిచేస్తున్న శ్రీ శివాజీ మహరాజ్ సేవాసమితి తరఫున జిల్లా వ్యాప్తంగా 2 వేల మంది సభ్యులు పనిచేస్తున్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ హాలిడేగా ప్రకటించాలని సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎం లక్ష్మణ్ రావు, జి రవికుమార్ డిమాండ్ చేస్తున్నారు.



చందూరు మండలం గోవూరులో శివాజీ విగ్రహం,



గన్నారంలో..



నిజామాబాద్ రైల్వేస్టేషన్ వద్ద..

కేసీఆర్ సేవలు దేశానికి అవసరం



కేక్ కట్ చేస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్
- జిల్లాకేంద్రంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

కామారెడ్డి క్రైం: బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సేవలు రాష్ట్రంతోపాటు దేశానికి అవసరమని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం జిల్లాకేంద్రంలోని గాంధీ గంజ్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. 70 కిలోల కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో జరిగిన ఘటనలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు చేయిచేసుకున్నారన్నారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేసి నిందితులపై కేసు నమోదు చేయించామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, నర్సింగ్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, కుంబాల రవి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల అవినీతిని వెలికితీస్తాం

- ప్రజలే నా బలం.. కార్యకర్తలే నా బలగం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

భిక్కనూరు: బీఆర్ఎస్ నేతల అవినీతిని వెలికి తీయడానికి సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం ఆయన సమక్షంలో భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు గల్లీ నుంచి హైదరాబాద్ వరకు అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతి పనిలో కమీషన్లను ఆశించడంతో పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ బీఆర్ఎస్ హయాంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలే తన బలమని, పార్టీ కార్యకర్తలే బలగమని, వారి సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ ఎన్ఆర్ఐ ఫోరం జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్‌లోకి మరో ముగ్గురు కౌన్సిలర్లు..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. తాజాగా 1, 36, 38వ వార్డుల కౌన్సిలర్లు గడ్డమీది రాణి, పంపరి లత, చాట్ల రాజేశ్వర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహదారు షబ్బీర్ అలీ వారిని పార్టీలో చేర్చుకున్నారు. దీంతో బల్దియాలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 25కు చేరుకుంది.



కౌన్సిలర్లు, నాయకులతో షబ్బీర్ అలీ

రైతుబంధు నిధులొచ్చేనా!?

యాసంగి సీజన్ సగం గడిచిపోయినా చాలామంది రైతుల ఖాతాలలో రైతుబంధు నిధులు జమ కాలేదు. ఇప్పటివరకు మూడెకరాలలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. త్వరగా నిధులు మంజూరు చేయాలని మిగిలిన రైతులు కోరుతున్నారు.

- ఇంకా 63,849 మందికి అందని పెట్టుబడి సాయం
- జిల్లాకు మరో రూ. 123 కోట్లు అవసరం
- మూడెకరాలపైన భూమి ఉన్న రైతుల ఎదురుచూపులు



కామారెడ్డి క్రైం : జిల్లాలో 3,16,087 మంది రైతులున్నారు. ఏటా రెండు సీజన్‌లలో వీరికి రైతుబంధు సాయం అందుతోంది. ఒక సీజన్‌లో రైతుబంధు పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించడానికి జిల్లాకు 267.02 కోట్ల నిధులు అవసరం అవుతాయి. యాసంగి సీజన్‌కు సంబంధించి డిసెంబర్ 10న రైతుబంధు నిధుల జమ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 12వ తేదీవరకు జిల్లాలోని 252,238 మంది రైతుల ఖాతాలలో రూ.143.89 కోట్లు జమ అయ్యాయి. ఇంకా 63,849 మందికి పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. వీరికి పెట్టుబడి సాయం అందించడానికి జిల్లాకు రూ. 123 కోట్లు అవసరం.

తప్పని పెట్టుబడి తిప్పలు..

యాసంగి సీజన్ ప్రారంభమై మూడు నెలలవుతోంది. జిల్లాలో వరి మినహా యాసంగి పంటల సాగు దాదాపు దగ్గర పడింది. డిసెంబర్‌లోనే జమ కావాల్సిన రైతుబంధు నిధులు ఇప్పటికీ పూర్తి స్థాయిలో జమ కాలేదు. సకాలంలో సాయం అందకపోవడంతో చాలామంది రైతులు ఇబ్బందిపడుతున్నారు. పంట పెట్టుబడుల కోసం అప్పులు చేశామని పేర్కొంటున్నారు. రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అందరికీ అందేనా?

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక రైతుబంధు పథకంలో మార్పులు తీసుకురావాలని భావించింది. కానీ అప్పటికే యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో ఈసారికి పాత పద్ధతిలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించింది. డిసెంబర్ 10వ తేదీన రైతుల ఖాతాలలో డబ్బుల జమ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటివరకు మూడెకరాలలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. దీంతో మిగతా రైతుల్లో ఆందోళన నెలకొంది. అందరికీ రైతుబంధు పథకం వర్తింపజేస్తారా లేక ఐదెకరాలలోపు వారికే ఇస్తారా అన్న విషయమై స్పష్టత లేదు.

వివరాలు ట్రెజరీకి పంపించాం



రైతుబంధు పథకానికి అర్హులైన రైతుల వివరాలను ఇప్పటికే ట్రెజరీకి పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైతుల ఖాతాలలో జమ అవుతున్నాయి. ఇప్పటివరకు మూడెకరాలలోపు భూమి కలిగిన రైతులకు సాయం అందింది. నిధులు విడుదల కాగానే మిగతా రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవుతాయి.

– భాగ్యలక్ష్మి, డీఏవో, కామారెడ్డి

అయినా తీరు మారలేదు..

- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మెరుగుపడని పారిశుధ్యం
- ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేస్తున్న రోగులు, వారి బంధువులు
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రి పరిసరాలు మారడం లేదు. రోగులు, వారి బంధువులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తూనే ఉన్నారు. దీంతో ఆస్పత్రి ఆవరణ ఎలుకలకు ఆవాసంగా మారుతోంది. కామారెడ్డిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో తరచూ ఎలుకలు రోగులపై దాడి చేస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 10వ తేదీన రోగిని ఎలుకలు కరచిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై విచారణ జరిపిన అధికారులు.. ఆస్పత్రిలో పారిశుధ్యలోపం కారణంగా ఎలుకలు వస్తున్నాయని గుర్తించి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అయితే తదుపరి చర్యలేవీ తీసుకోకపోవడంతో ఆస్పత్రిలో పరిస్థితి మరడం లేదు.

ఎక్కడ పడితే అక్కడే..

కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇరుకుగా తయారైంది. వైద్య కళాశాలతోపాటు తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని 34 విభాగాలు ఉండడంతో ఈ ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతుంటుంది. ఆస్పత్రిలో ప్రస్తుతం 130 పడకలున్నాయి. రోగులు, వారి బంధువులతో ఆస్పత్రి సందడిగా ఉంటుంది. అయితే ఆస్పత్రిలో స్థలం లేకపోవడంతో రోగులు, వారి బంధువులు ఆస్పత్రిలోని మెట్లు, ర్యాంపు, ఆయా విభాగాల బయట, దారిలో, వాహనాల పార్కింగ్ స్థలం వద్ద.. ఇలా ఎక్కడ పడితే అక్కడే భోజనాలు చేస్తున్నారు. అనంతరం వ్యర్థాలను అక్కడే పడేస్తుండడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో ఆ వ్యర్థాలను తినేందుకు ఎలుకలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి, రోగుల బంధువులు వేచి ఉండడానికి, భోజనాలు చేయడానికి షెడ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు.



మెటర్నిటీ వార్డు పక్కన భోజనాలు చేస్తున్న రోగుల బంధువులు

క్లుప్తంగా

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్ (ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 2లక్షల 95వేల 654 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీఎస్పీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్ : బీఎస్పీ కామారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి బాల్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధులను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడుగా కొక్కొండ రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా భీమరి భాస్కర్‌ముదిరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తమ్మడి స్వామి, కోశాధికారిగా దుంపల సురేష్‌లను ఎన్నుకున్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లిలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు రమేశ్ రావు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసమై ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దామోదర్ రావు, మోహన్ రావు, శివాజీరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లపై కేసీఆర్ ఫొటో తొలగించాలి



బాన్సువాడ : ఆస్పత్రిలో ఉన్న అంబులెన్స్‌లపై మాజీ సీఎం కేసీఆర్ ఫొటోను తొలగించాలని శనివారం ఆస్పత్రి సుపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్ మాట్లాడుతూ బాన్సువాడ ఏరియా ఆస్పత్రి, మాత శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న అంబులెన్స్‌లపై మాజీ సీఎం కేసీఆర్ ఫొటోను వెంటనే తొలగించాలన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఫొటోలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నార్ల రఘు, సలీం, అంబర్‌సింగ్, యునుస్, లయక్ తదితరులు ఉన్నారు.

నా రూటే సపరేటు..

- మాదాపూర్ కంకర క్వారీ యజమాని వింత పోకడ
- గడువు ముగిసి మూడేళ్లయినా కొనసాగుతున్న వైనం
- అర్ధరాత్రి కొనసాగుతున్న పనులు
- రూ. 43.50 లక్షల జరిమానా విధించినా మారని ధోరణి
- అండగా నిలుస్తున్న అధికారులు?



నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడుతున్న కంకర క్వారీ

మాక్లూర్: ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తనను ఎవరూ.. ఏ అధికారి ఏమీ చేయరన్న పొగరుతో ఓ కంకర క్వారీ యజమాని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడు. సదరు క్వారీ లీజు గడువు ముగిసినా యథేచ్ఛగా కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండిగొడుతున్నాడు. ఇటీవల ఉన్నతాధికారులు క్వారీని సీజ్ చేసినా సంబంధిత అధికారులకు ఆమ్యామ్యాలు చెల్లిస్తూ అర్ధరాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా మైనింగ్ పనులు చేపడుతున్నట్లు సమాచారం.

మండలంలోని మాదాపూర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో గ్రానైట్‌ను ఆధారంగా చేసుకొని కొన్నేళ్లుగా రెండు కంకర క్వారీలు కొనసాగుతున్నాయి. అందులోని ఓ కంకర క్వారీ గడువు 2020 ఫిబ్రవరి 3న ముగిసింది. అయినా నాటి నుంచి ఆ క్వారీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ విషయం ఇటీవల స్థానిక ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి మాక్లూర్ పర్యటనలో భాగంగా పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే కంకర మిషన్‌లోకి వెళ్లి తనిఖీ చేయడంతో అసలు విషయం బయటపడింది. మూడేళ్లుగా ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండా ఎలా కొనసాగిస్తున్నారని క్వారీ యజమానిని ప్రశ్నించారు. ఈ విషయమై మైన్స్ ఏడీ సత్యనారాయణను నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే క్వారీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సీజ్ చేయించారు. రూ. 43.50 లక్షల జరిమానా విధించేలా చేశారు. విధించిన జరిమానా చెల్లించి, క్రషర్‌కు కొత్తగా అనుమతులు పొందే వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయాలని మైన్స్ ఏడీతో విద్యుత్ అధికారులకు లెటర్ కూడా జారీ చేయించారు. కానీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు మాత్రం విద్యుత్ సరఫరాను నిలిపివేయలేదు. దీంతో సదరు క్రషర్ యజమాని అర్ధరాతుల్లో క్రషర్ పనులు చేసుకుంటున్నట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం

మాదాపూర్ శివారులో అనుమతులు లేకుండా కొనసాగుతున్న కంకర క్వారీని సీజ్ చేసి యజమానికి నోటీసులు జారీ చేశాను. క్వారీకి విద్యుత్ సరఫరాను నిలిపి వేయాలని విద్యుత్ శాఖ అధికారులకు లెటర్ కూడా ఇచ్చాను. క్వారీ రాత్రి వేళల్లో కొనసాగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, మైన్స్ ఏడీ, నిజామాబాద్

విద్యాశాఖలో అక్రమాలపై విచారించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు

కామారెడ్డి టౌన్ : విద్యాశాఖలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నాయకులు శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య చైర్మన్ యాదయ్య మాట్లాడుతూ రెండేళ్లు పూర్తయినప్పటికీ సుదీర్ఘంగా ఏసీజీఈ అధికారి ఒక్కరే నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తున్నారన్నారు. సీనియర్‌లను నియమించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి పోస్టును హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ లేకుంటే సైన్స్ జీహెచ్‌ఎంకు ఇవ్వాలన్నారు. అక్రమ డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసినా ఇంకా కొనసాగుతున్నాయని, డీఈవో అక్రమ డిప్యూటేషన్లు వేశారని కలెక్టర్‌కు వివరించారు. లింగంపేట్ మండలంలోని పోతాయిపల్లి, సదాశివనగర్, ఉత్తునూర్, భిక్కనూర్, బస్వాపూర్‌లో అక్రమ డిప్యూటేషన్లు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, రాములు, బషీర్, దేవులా తదితరులున్నారు.

బాధితుడికి పరామర్శ



భిక్కనూరు : మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నవ్య కుటుంబాన్ని మాజీ ప్రభుత్వ విప్ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ శనివారం పరామర్శించారు. అలాగే నవ్య భర్త స్వామి గౌడ్ కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. ఆయనను కూడా గోవర్ధన్ పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహా రెడ్డి, శ్రీసిద్ధరామేశ్వరాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, విండో డైరెక్టర్ వెంకటిగౌడ్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

కామారెడ్డి టౌన్ : జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో జర్నలిస్టులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రకటించిన జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామన్నారు. కామారెడ్డి ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేయాలని జర్నలిస్టులు విన్నవించగా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి క్లబ్‌కు అవసరమైన భవనాన్ని సమకూర్చాలని ఆదేశించారు.

గణితంపై భయం వీడాలి

నిజామాబాద్ అర్బన్: విద్యార్థులు గణితంపై భయం వీడితేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని నిజామాబాద్ డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో విశ్వం అబాకస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గణిత పోటీలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. అబాకస్ నేర్చుకుంటే పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు.

మానవ జన్మ ఉత్తమమైంది



ప్రవచనాలు చేస్తున్న తొగుట రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : అన్ని జన్మల్లోకెల్లా మానవ జన్మ ఉత్తమమైనదని తొగుట రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. శనివారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో శ్రీ పాలోజ్యుల శ్రీనివాస శర్మ స్వగృహంలో పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. తోటి మానవుడిలో భగవత్ స్వరూపంగా భావించాలని, ఈర్ష్య ద్వేషాలు వదలాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈవోకు సన్మానం




దోమకొండ : జెడ్పీ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన చంద్రనాయక్‌ను శనివారం ఆయన కార్యాలయంలో జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి, లింగంపేట్ జెడ్పీటీసీ శ్రీలత సంతోష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో మాచారెడ్డి సొసైటీ డైరెక్టర్ల చేరిక



కామారెడ్డి టౌన్ : మాచారెడ్డి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. మాచారెడ్డి మండలం ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్లు 9 మంది శనివారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలో చేరారు.

నియామకం



నియామకపత్రం అందజేస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : మాచారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాలోత్ నౌసిలాల్ నాయక్‌ను ప్రభుత్వ సలహదారు షబ్బీర్ అలీ శనివారం నియమించారు. అలాగే మండల కార్యనిర్వహణ అధ్యక్షుడిగా బ్రహ్మానందరెడ్డిని నియమిస్తూ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో వారికి నియామకపత్రాలను అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాచారెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.

బగళాముఖి అమ్మవారి జన్మదినోత్సవం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో బగళాముఖి అమ్మవారి జన్మదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అష్టమిని పురస్కరించుకుని ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు క్రాంతి, బీజేపీ నాయకులు పైడి ఎల్లారెడ్డి, రేవంత్, విఠల్, సతీష్, వెంకన్న తదితరులున్నారు.

సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో పూజలు



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహారాజ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.

శివాజీ జయంతి రోజు సెలవు ప్రకటించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : ఛత్రపతి శివాజీ జయంతి రోజును రాష్ట్ర ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని కోరుతూ శనివారం మండల ఛత్రపతి శివాజీ సేన ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రాంతికుమార్, సందీప్, దుర్గాప్రసాద్, సాయిలు, శ్రీకాంత్, అనిల్ తదితరులున్నారు.

విద్యార్థుల స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని తాండూర్ హైస్కూల్‌లో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటివిద్యార్థులకు పాఠాలను బోధించారు. స్వయంపాలన దినోత్సవంలో భాగంగా డీఈవోగా కిరణ్, హెచ్‌ఎంగా దీపిక, పీఈటీలుగా జగన్, అనిల్, ఉపాధ్యాయులుగా అనూష, వైశాలి, అఖిల, జస్వంత్, దేవిసింగ్, మాధవి, సాదియా వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, దిగంబర్, అంబరీష్‌రావు, రవికుమార్ తదితరులున్నారు.

గత ప్రభుత్వం ఉద్యోగులను అణచివేసింది



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

సుభాష్‌నగర్: గత ప్రభుత్వం ఉద్యోగులను అణచివేసిందని, వారి జీతభత్యాలు సకాలంలో చెల్లించక మానసికంగా వేధించిందని ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని టీఎన్‌జీవో కార్యాలయంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన టీఎన్‌జీవో, టీజీవో, క్లాస్–4 ఉద్యోగ సంఘాల క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సప్లిమెంటల్ బిల్లులన్నీ త్వరలో ఇప్పించేలా కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల సమస్యలను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సమన్వయ పర్చుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకమని గుర్తుచేశారు. అనంతరం మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ కో చైర్మన్, టీజీవో జిల్లా అధ్యక్షుడు అమృత్‌కుమార్, ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు నేతికుంట శేఖర్, సాయిలు, టీజీవో జిల్లాకార్యదర్శి హన్మంత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పోల శ్రీనివాస్, సతీశ్, అజ్మీర రాంజీ, గౌండ స్వామి తదితరులున్నారు.

చెక్కు అందజేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రంలోని గోపాల్‌పేటకు చెందిన వి సుమలతకు శనివారం స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ దామోదర్ రూ. 20 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. సుమలత భర్త రాజేశ్ తమ బ్యాంకులో ఏడాదికి రూ.వెయ్యి చొప్పున చెల్లించి ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ చేయించుకున్నాడని, ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా రూ. 20 లక్షలు చెక్ బాధిత కుటుంబానికి అందజేస్తున్నట్లు తెలిపారు. క్యాషియర్ సాయిలు, సిబ్బంది శశిధర్, శ్రీకాంత్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఐఎంల్ డిపో ఎక్సైజ్ ఎస్సైగా ప్రమోద్ చైతన్య

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ ఐఎంఎల్ డిపోలో ఎక్సైజ్ ఎస్సైగా ప్రమోద్ చైతన్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పని చేసిన ఎస్సై సుదర్శన్ ఎఫ్‌డీవోగా ప్రమోషన్‌పై కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రమోద్ చైతన్య మాక్లూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఇరువురు అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో బీఎం గురువయ్య, కానిస్టేబుల్ చల్ల బాబు, కార్మిక సంఘం అధ్యక్షుడు దుబాయ్ శ్రీను, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సిర్‌పూర్‌లో ద్విచక్ర వాహనం దగ్ధం

మోపాల్: మండలంలోని సిర్‌పూర్‌లో తస్లీమాకు చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి దహనం చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొత్త కాలనీలో తస్లీమా రోజూ మాదిరిగానే తన ఇంటి ఎదుట వాహనాన్ని నిలిపింది. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహం అడ్డగింత

ధర్పల్లి: మండల కేంద్రంలో బాల్యవివాహాన్ని అధికారులు శనివారం అడ్డుకున్నారు. మండల కేంద్రానికి చెందిన మైనర్ అమ్మాయికి జక్రాన్‌పల్లికి చెందిన 23 ఏళ్ల యువకుడితో ఈనెల 18న వివాహం చేయాలని ఇరు కుటుంబీకులు నిర్ణయించారు. దీంతో బాల్య వివాహం చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, చైల్డ్‌లైన్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జ్యోత్స్న, ఎస్సై వంశీకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి అమ్మాయి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాల్య వివాహం చేయడం నేరమని వారికి అవగాహన కల్పించారు. అమ్మాయి మేజర్ అయ్యాకే వివాహం చేయాలని లేకపోతే అది నేరమని హెచ్చరించారు.

కొండచిలువ పట్టివేత



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో కొండచిలువను పోలీసులు శనివారం పట్టుకున్నారు. సుమారు 10 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ ఉన్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని పట్టుకున్నట్లు తెలిపారు. దీనిని అటవీ ప్రాంతంలో వదిలి పెడతామని మెండోరా ఫారెస్ట్‌సెక్షన్ అధికారి గణేశ్ తెలిపారు. ఎస్సై భాస్కరా చారి, ఏఎస్సై చిన్న గంగారాం, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



కిరణ్ కుమార్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ మెడికల్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని విద్యుత్‌నగర్ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త బస్టాండ్ ఎదురుగా మెడికల్ నిర్వహిస్తున్న కుసుమ కిరణ్‌కుమార్(35) డిగ్రీ కళాశాల గ్రౌండ్ సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అతనికి ఆరేళ్ల క్రితం పల్లవితో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆరు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పిల్లలతో కలిసి పల్లవి తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి చెందిన కిరణ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి లక్ష్మీపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత..

బిచ్కుంద(జుక్కల్): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దదడ్గి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తంబలి లక్ష్మి(45) భర్త గంగారాంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన లక్ష్మి గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మాక్లూర్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాణిక్‌బండార్ చౌరస్తాలో కాలినడకన ఓ వ్యక్తిని శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో ఓ కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. సదరు వ్యక్తి ఒంటిపై బనియన్, లుంగీ తప్ప ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. కార్పొరేటర్ రాయ్‌సింగ్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ధర్పల్లి: మండలంలోని రేకులపల్లి, రామడుగు శివారులోని వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బోధన్‌రూరల్‌లో..

బోధన్‌రూరల్: మండలంలోని ఖండ్‌గావ్–కొప్పర్గ శివారులో రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. ప్రభుత్వ అనుమతి తీసుకొని ఇసుకను తరలిస్తున్నట్లు డ్రైవర్లు చెప్పారని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.